సాక్షి
కాకినాడ

గురువారం | 10 | జూలై | 2025



నానాటికీ ప్రభంజనం..

భారతదేశం జన ప్రభంజనం అవుతుంది.. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశ జనాభా కేవలం 35 కోట్లు కాగా, 80 ఏళ్ల అనంతరం నాలుగు రెట్లకు పైగా చేరుకుందని అంచనా.


4లో



దళిత మహిళపై దాడి అమానుషం

దుప్పలపూడి గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళ కొమ్ము బుజ్జిపై దాడి చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి 2,30,624 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 13,750 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

కనకదుర్గమ్మకు ఘనంగా చండీ హోమం



చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా బుధవారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. చండీ హోమం, పూజ కార్యక్రమాలను వేద పండితులు సంతోష్ అవధాని, ఆలయ అర్చకుడు చిట్టెం గోపీ, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ నిర్వహించారు. నలుగురు భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీలో లైంగిక వేధింపుల ఫిర్యాదుపై విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పనిచేస్తున్న మహిళలపై డిపోకు చెందిన ఒక ఉద్యోగి లైంగిక వేధింపులు పాల్పడుతున్నారంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు విజయవాడ నుంచి ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ చేసేందుకు బుధవారం వచ్చారు. అయితే ఫిర్యాదు దారు పేరు లేకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్టీసీలో పనిచేస్తున్న అందరి మహిళలను ఉన్నతాధికారులు విచారించారు. తాము ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని మహిళా కండక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొందరు వ్యక్తులు కావాలని ఆర్టీసీ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు అక్కడ ఉద్యోగులు చెబుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదిక ఉన్నతాధికారులు సమర్పిస్తామని చెప్పారు.

రైల్వే ఉద్యోగుల ధర్నా



సామర్లకోటలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల ధర్నా

సామర్లకోట: రైల్వే ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పెన్షన్ ప్రతీ కార్మికుని హక్కు అని, దాని సాధనకు కార్మికులందరూ ఐక్యంగా కలిసి రావాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. రైల్వే ఉద్యోగుల న్యాయబద్ధమైన కోర్కెలను అమలు చేయాలని నినాదాలు చేశారు. సంఘ చైర్మన్ టి.ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ రామకృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ విశ్వప్రసాద్, వైస్ చైర్మన్ గోపాలరెడ్డి, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు కెవీ వెంకటేశ్వరరావు, ఇంజినీరు రామసుబ్బారావు పాల్గొన్నారు.

అదే వేలంకొర్రి!

- శ్రీ సంస్థానం భూముల వేలంపాట మళ్లీ వాయిదా
- దేవాదాయానికి 'తమ్ముళ్ల' తూట్లు
- ఏటా రూ.70 లక్షల ఆదాయానికి గండి
- నాలుగోసారి వాయిదా పడిన వైనం
- చక్రం తిప్పుతున్న తుని పెద్దన్న



తొండంగిలోని శ్రీ సంస్థానం భూముల్లో పొలం పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: లక్షల ఆదాయం వస్తుందని తెలిసినా దాన్ని రాబట్టుకోవడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. పిఠాపురం మహారాజా దానం చేసిన వందల ఎకరాల భూములకు వేలం నిర్వహించకుండా వాయిదాలు వేస్తూ దేవాదాయానికి గండికొడుతున్నారు. అధికార పార్టీ నేతల మోచేతి నీళ్లు తాగుతూ వారు చెప్పినట్టు తలాడిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేలం వాయిదాకు వారు చూపుతున్న సాకులు, చెబుతున్న కారణాలు చూసి రైతులు విస్తుపోతున్నారు. మొదట మే 23, తరువాత జూన్ 6 అన్నారు. ఆ తరువాత జూన్ 20కి వాయిదా వేసి అప్పుడు కూడా వేలం నిర్వహించలేదు. తిరిగి ఈ నెల ఎనిమిదిన అన్నారు. ఆ తేదీన కూడా జరపలేదు. మళ్లీ జూలై14 తేదీకి వాయిదా వేశారు. ఒకోసారి ఒకో కుంటిసాకు చెబుతూ వేలాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

కడపలో టీడీపీ మహానాడుకు రైతులు వెళ్లిపోతున్నారని ఒకసారి, యోగా డే అని మరోసారి, తాజాగా మంగళవారం పోలీసు బందోబస్తు లేదని...ఇలా వాయిదాలు వేస్తూ అధికారులు కూటమి నేతల కొమ్ము కాస్తూవస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవదాయశాఖ కాకినాడ జిల్లా కార్యాలయం నుంచి పిఠాపురం శ్రీ సంస్థానం కార్యనిర్వాహణాధికారి కార్యాలయం వరకు అధికారులు కావాలనే కాలయాపన చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ సంస్థానంకు చెందిన రెండు పంటలు పండే సారవంతమైన 511 ఎకరాలున్నాయి. ఇందులో రైతులు మకాంలు తీసేయగా సాగులో ఉన్న మిగిలిన 478 ఎకరాలకు వేలం వేయకుండా నాలుగోసారి కూడా వాయిదా వేయడం విస్మయానికి గురిచేస్తోంది. దేవదాయశాఖ చరిత్రలో ఇంత నిస్సిగ్గుగా ఇన్ని వందల ఎకరాల భూములకు వేలం వేయకుండా వాయిదాలు వేస్తున్న తీరు విస్తుగొలుపుతోంది. దేవదాయశాఖ పారదర్శకంగా వేలం వేస్తే హక్కులు దక్కించుకుందామని, కౌలుకు సాగు చేసుకుందామని సుమారు రెండు వందల మంది కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు. పంపా జలాశయంలో నీటిమట్టం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ఒక పక్క ఖరీఫ్ సాగుకు అదను దగ్గర పడుతోంది. వేలం ఎప్పుడు వేస్తారో? భూములు ఎవరికి దక్కుతాయా అని ఎదురుచూస్తూ ప్రస్తుతం ఆ భూముల్లో ఉన్న కౌలు రైతులు దుక్కులు దున్ని ఆకుమడుల కోసం భూములు సిద్ధం చేస్తున్నారు. అసలు భూములకు వేలం వేస్తారా లేదా అని కౌలు



పిఠాపురంలోని శ్రీ సంస్థానం

రైతులు అనుమానపడుతున్నారు.

దొడ్డిదారిన దక్కించుకోవాలని...

పంపా ఆయకట్టు పరిధిలోకి వచ్చే ఈ భూములను మూడేళ్ల కాలానికి వేలం నిర్వహిస్తుంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేలం నిర్వహించి మూడేళ్ల కాలానికి రైతులకు భూములు కౌలుకు ఇచ్చారు. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు కౌలు ఖాయమైంది. కౌలు గడువు ముగిసిపోయింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. అంతే తుని ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నేతలు గద్దల్లా వాలిపోయారు. వేలం వేయకుండా దొడ్డిదారిన ఆ భూములను దక్కించుకోవాలనే కుయుక్తులతో అధికార పార్టీకి చెందిన తుని పెద్దన్న కనుసన్నల్లో తెలుగు తమ్ముళ్లు పెద్ద స్కెచ్ వేశారు. మొదట భూములకు వేలం వేయకుండా అడ్డుకట్ట వేయాలనేది వారి ప్లాన్. అంత వరకు వారు దేవదాయశాఖ అధికారుల తోడ్పాటుతో సక్సెస్ అయ్యారు. ఇప్పుడు వారంతా భూములు ఎలా దక్కించుకోవాలనే ఎత్తుగడలకు పదును పెడుతున్నారు.

కౌలు రైతులను ఇబ్బందులు పెట్టకండి



శ్రీ సంస్థానంకు చెందిన తొండంగిలోని భూములకు కౌలు వేలం వేయడానికి అధికారులు మూడు నెలల నుంచి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. వాయిదాలు వేయడం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సాగు కాలం దగ్గర పడడంతో ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్నుకుని, నారుమడులకు సిద్ధపడుతున్నారు. దేవదాయశాఖ అధికారులు ఇకనైనా వాయిదా వేయకుండా వేలం నిర్వహించడం కానీ లేకుంటే ప్రస్తుతం ఉన్న రైతులకే కౌలు కొనసాగించడం కానీ చేయాలి.

– నాగం గంగబాబు, వైస్ ఎంపీపీ, తొండంగి

ఎంతకాలం వాయిదాలు వేస్తారు?

వాస్తవానికి ఈ భూముల వేలం ద్వారా ఏటా శ్రీ సంస్థానానికి సుమారు రూ.70 లక్షల ఆదాయం వస్తోంది. అదే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా పారదర్శకంగా గనుక వేలం నిర్వహిస్తే మూడేళ్ల కాలానికి రూ.2.15 కోట్ల ఆదాయం వస్తుంది. ఇంతటి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా దేవదాయశాఖ అధికారులు మాత్రం అధికారపార్టీ నేతలకు కొమ్ము కాస్తూ వాయిదాలతోనే కాలక్షేపం చేస్తున్నారు. నాడు పిఠాపురం రాజా బాటసారులు, పాదగయ, కుక్కుటేశ్వరస్వామి తదితర ఆలయాలకు వచ్చే భక్తుల ఆకలితీర్చాలనే ఆశయంతో 511 ఎకరాలు దానం చేశారు. శ్రీ సంస్థానం సత్రం పిఠాపురంలో ఉన్నప్పటికీ భూములు మాత్రం తుని నియోజకవర్గం తొండంగి మండలంలో ఉన్నాయి. తొండంగి మండలంలో 538, 545, 553, 535, 623, 565, 690 సర్వే నంబర్‌లలో ఈ భూములున్నాయి. ఇన్ని ఎకరాలకు వేలం వేయకుండా ఎంతకాలం వాయిదాలు వేస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

పవన్ పట్టించుకోవడం లేదేం?

ఇదిలా ఉండగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పెద్ద యుద్ధమే చేస్తున్నారని పవన్ అభిమానులు గొప్పగా చెప్పుకొంటున్నారు. అటువంటి పవన్ శ్రీ సంస్థానం భూముల వేలం నిర్వహించకపోవడంపై ఎందుకు దృష్టి పెట్టడంలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భూములున్నది తుని నియోజకవర్గంలో అయినా భూములిచ్చింది పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పిఠాపురం రాజా అనే విషయాన్ని పవన్ అభిమానులు గుర్తించకుంటే ఎలా అంటున్నారు. చివరకు శ్రీ సంస్థానం కార్యాలయం కూడా పిఠాపురంలో ఉండటాన్ని గుర్తుచేస్తున్నారు.

ఇవేం ఉత్తర్వులు?

- ఏఎన్ఎం బదిలీల్లో గందరగోళం
- ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఎంపీడీఓ

జగ్గంపేట: సచివాలయాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను 5సంవత్సరాలు దాటిన సందర్భంగా వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తూ జిల్లా వైద్యశాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని పట్టుకుని ఏఎన్ఎంలు మండల పరిషత్ అధికారులను కలిసి తమను రిలీవ్ చేయాలని కోరుతున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రిలీవ్ చేయడానికి ఎంపీడీఓలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనితో ఏఎన్ఎంల బదిలీలు గందరగోళంలో పడ్డాయి. జగ్గంపేట మండలంలోని రాజపూడి, కాట్రావుపల్లి గ్రామాలలో సీహెచ్‌సిలు వున్నాయి. వీటి పరిధిలోని సచివాలయాలలో 24 మంది ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. రాజపూడిలో పీహెచ్‌సీ పరిధిలో 16 మందికి, కాట్రావులపల్లి పీహెచ్‌సీ పరిధిలో జగ్గంపేట మండలానికి సంబంధించి ఏడుగురికి బదిలీ అయ్యింది. వీరంతా జగ్గంపేట మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్‌ను బుధవారం కలిసి రిలీవ్ చేయాలని కోరడంతో ఆయన జిల్లా వైద్యశాఖ ఇచ్చిన ఆర్డర్ పరిశీలించారు. అందులో సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఎంపీడీవోలు రిలీవ్ చేయాలని ఎక్కడా లేకపోవడంతో ఆయన అభ్యంతరం చెప్పారు. దీనితో ఏఎన్ఎంలు జిల్లా అధికారులకు ఫోన్ చేసి తమ ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఇదే విషయమై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. ఆర్డర్‌లో మార్పులు చేసి మండల పరిషత్ అధికారిని రిలీవ్ చేయమని ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా వైద్యశాఖ కార్యాలయ అధికారులకు సూచించినట్లు చెప్పారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయ అధికారులు పరిశీలించి పంపుతామని చెప్పారని, అప్పుడు ఏఎన్ఎంలను రిలీవ్ చేయగలమని తెలిపారు.

లేటరైట్ రవాణా వాహనాల అడ్డగింపు



జల్దాం సమీపంలో లాటరైట్ లారీలను అడ్డుకున్న గిరిజనులు

రౌతులపూడి: గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల దోపిడీ ఆపాలంటూ సబ్‌ప్లాన్ ఏజెన్సీ వాసులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో యథేచ్ఛగా లేటరైట్ రవాణా చేసే లారీలను జల్దాం, మాతయ్యపేటకు చెందిన పలువురు గిరిజనులు అడ్డుకున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు దోచేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన నాటి ప్రతిపక్ష నాయకులు (నేటి పాలకులు) మూడేళ్ల క్రితం సబ్‌ప్లాన్ ఏజెన్సీలో పర్యటించి గిరిజన ప్రాంతాలను ఉద్ధరిస్తామంటూ చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చింది సహజ వనరులు దోపిడీకేనా అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బమిడికలొద్దు ప్రాంతంలో లాటరైట్‌ను వందలాది భారీ వాహనాల్లో భారీగా రవాణా సాగించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. శబ్ద,వాయు కాలుష్యాలకు గురై నిత్యం అనారోగ్యాల పాలవుతున్నామని, రహదారులు ఛిద్రమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. రహదారికిరువైపులా వున్న వ్యవసాయ భూములు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లోను, స్థానిక పోలీస్ స్టేషన్‌లోను జిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. సీఎంఓ కార్యాలయానికి, అటవీ, పర్యావరణ పరిరక్షణ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశామని వారు వివరించారు. స్థానిక గిరిజనులను మభ్యపెట్టి లాటరైటను తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే లాటరైట్ తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లారీలు అడ్డగించడంతో రవాణా చేసేవారికి గిరిజనులకు కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై లాటరైట్ నిర్వాహకులకు తెలియజేసి తక్షణమే లాటరైట్ రవాణాను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన నాయకులు గంటిమళ్ల గంగరాజు, రావుల తారక్, ఆమూరి సుధారాణి, ఆమూరి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం..దగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

సామర్లకోట: చంద్రబాబు అంటేనే మోసం..దగా అని దీనిని ప్రజలందరూ గుర్తించారని కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. పెద్దాపురం నియోజవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చంద్రబాబు అధికారం కోసం ఏదైనా చేస్తారన్నారు. నాలుగుసార్లు మోసం చేయడంతో తనను నమ్మరని తెలిసి పవన్‌కల్యాణ్‌ను అడ్డు పెట్టుకున్నారన్నారు. గత ఎన్నికల్లో అధికారంలోకి రావడం కోసం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మరో పర్యాయం మోసం చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేశారని తెలిపారు. రైతులను, మహిళలను, యువతను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. దానికి ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటన చేసినా ప్రజలు ఉప్పెనలా రావడంతో చంద్రబాబు చూడలేక పోతున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లే వారిపై కేసులు పెడతామని చెప్పి 1,200 మందిపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలను చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాస్పత్రులలో మందులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇంగ్లిషు మీడియంను రద్దు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సూపర్ సిక్స్‌లో రెండు పథకాలు మాత్రమే అరకొరగా అమలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్‌పై పవన్ కల్యాణ్ బాధ్యత తీసుకొవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రతీ కార్యకర్తకు తాను అండగా ఉంటానని, అవసరమైతే పోరాటాలకు సిద్ధమని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ఏక పక్షంగా విజయం సాధించే విధంగా కార్యకర్తలు ఐక్యతతో పని చేయాలన్నారు. దొరబాబును ఎమ్మెల్యేగా చేయడానికి ప్రతీ ఒక్కరూ పని చేయాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు...

జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని, వైఎస్సార్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీఎం స్థానంలో ఉన్నవారికి మేనిఫెస్టోపై బాధ్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో తాను మాట్లాడిన దానికి తప్పుడు అర్థాలు తీయడం ఏమిటని ప్రశ్నించారు. తమది ఉడత బెదిరింపులకు భయపడే కుటుంబం కాదని, ప్రజల తరఫున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. పవన్ కల్యాణ్ కాపు సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకొని ఎదిగి, వారికి ఏమి మేలు చేశారని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్‌లు ఇంటింటికీ సంక్షేమ పథకాలతో కుటుంబానికి ఏడాదికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరిస్తూ బాండ్లు పంపిణీ చేశారని, అధికారంలోనికి వచ్చాకా మొండి చెయ్యి చూపించారని విమర్శించారు.

ఇదేండబ్బా ప్రచారం

- మెగా పీటీఎం 2.0 పేరుతో కార్యక్రమం
- తల్లికి వందనంపై సొంత బాకా
- ఉపాధ్యాయులకు పనిభారం
- పక్కదారి పట్టిన విద్యాబోధన



మెగా పీటీఎం 2.0 కార్యక్రమం నేపథ్యంలో పాఠశాల గదిలో కట్టిన మామిడి తోరణాలు

కపిలేశ్వరపురం: చేసేది తక్కువ... గొప్పలెక్కువ అన్నట్టు కూటమి ప్రభుత్వ తీరు ఉంది. విలువైన ప్రజాధనాన్ని ప్రచారానికే కేటాయిస్తుంది. ఇప్పటి వరకూ యోగా దినోత్సవం పేరుతో సుమారు రూ.300 కోట్లను ఖర్చు చేసింది. అంతర్జాతీయంగా కూటమి ప్రభుత్వానికి ప్రశంసలు దక్కాయంటూ గొప్పలు చెప్పుకొంది. అదే కోవలో నేడు మరో ప్రచారానికి సిద్ధం చేసింది. మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమాన్ని మెగా పీటీఎం 2.0 పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించేందుకు కార్యాచరణ చేసింది. విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం వెనుక కూటమి ప్రభుత్వ ప్రచారం దాగి ఉంది. దీని నిర్వహణకు పరిమితంగా నిధులను కేటాయించి, స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ నుంచి ఖర్చు పెట్టుకోమని చెబుతోంది. ప్రైవేట్ సంస్థల్లో ఆ యాజమాన్యం సొంత ఖర్చుతో కార్యక్రమాన్ని పండగలా చేయాలని సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రస్తుతం ఈ కార్యక్రమం తలకు మించిన భారంగా మారుతోంది.

నేడు విద్యాసంస్థల్లో కార్యక్రమాలు

జిల్లావ్యాప్తంగా ఉన్న 2,150 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల ఫలితాల వివరాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయనున్నారు. వీటితోపాటు మరికొన్ని కార్యక్రమాలు రూపొందించినప్పటికీ ప్రధాన అజెండా కూటమి ప్రభుత్వ ప్రచారమే. తల్లికి వందనం సాయం అందజేశామన్న విషయాన్ని ఫోకస్ చేసే దిశగా కార్యక్రమాన్ని రూపొందించారు.

ఇప్పటికే సన్నాహక సమావేశాలు

ఈ నెల 4న ఇంటర్మీడియెట్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అమలాపురం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం సన్నాహక సమావేశం నిర్వహించారు. 8న జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్‌కు జిల్లా సన్నాహక సమావేశం జరిపారు. పిల్లలకు పాఠాలు చెప్పే పనిని పర్యవేక్షించాల్సిన విద్యా సంస్థ నిర్వాహకులు, బాధ్యులను కూటమి ప్రభుత్వ ప్రచారాన్ని సమయాన్ని కేటాయించమనడంపై నిరసన వ్యక్తమవుతోంది.

ఇది సాధ్యమయ్యేనా?

పాఠశాలల్లోనే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో విద్యార్థులతో మొక్కలను నాటాలని సూచించారు. ఆ మొక్కలను విద్యార్థి బాధ్యతగా సంరక్షించాలని చెబుతున్నారు. రోజూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అది సాధ్యం కాదు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంటే మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ ప్రత్యేక నిధులను, సిబ్బందితో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వివాదాలు రాకుండా చూడాలని..

పేరెంట్స్ మీటింగ్ అనగానే తల్లిదండ్రులు తమ పిల్లల చదువుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సాయం వివరాలను తెలుసుకోవాలని అనుకుంటారు. ఇటీవల తల్లికి వందనం లబ్ధిదారుల్లో అనేక మంది అర్హులకు సాయం అందలేదు. వారు అధికారులను ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం పేరెంట్స్ మీటింగ్‌లో వివాదాలు రాకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే అని, ప్రొటోకాల్ వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలంటూ సూచించింది.

ప్రచారం.. పనిభారం

ఈ కార్యక్రమ మార్గదర్శకాల్లోనే నాలుగైదు **రోజుల ము**ందు నుంచే ఏమేమి చేయాలో కార్య**కలాపాలను** పొందుపర్చారు. పాఠశాలల్లో పాఠా**లు చెప్పా**ల్సిన ఉపాధ్యాయులను తల్లికి వం**దనం పథ**కాన్ని ప్రచారం చేసేవారిగా ప్రభుత్వం **మార్చేసింది**. 17 కమిటీలను వేసి కార్యక్రమాన్ని **విజయవం**తం చేయమని ప్రభుత్వం చెప్పడం**తో ఉపా**ధ్యాయులంతా ఇదే పనికి తమ విలువైన సమయాన్ని కేటాయించాల్సి వస్తుంది. ఇందులో ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు సచివాలయ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను భాగస్వాములను చేశారు. వీరిని ఒక్కో పాఠశాలకు పర్యవేక్షకులుగా నియమించారు. వారి శాఖల పనిని పక్కన పెట్టి ప్రభుత్వ ఆదేశాలను పాటించే స్థితికి తీసుకొచ్చారు.

నేడు మెగా పీటీఎం

కాకినాడ సిటీ: జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలు, సాంకేతిక విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో మెగా పీటీఎం 2.0 కార్యక్రమం, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ ఉమెన్ హాకీ చాంపియన్ షిప్ (అండర్–19) ఏర్పాట్ల వివరాలను పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని 1,260 ప్రభుత్వ, 596 ప్రైవేటు, 20 ఎయిడెడ్ పాఠశాలల్లో 2,78,932 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 131 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, సాంకేతిక విద్య సంస్థల్లో 45,344 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరందరి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మెగా పీటీఎం వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామన్నారు.

ఆగస్టు 3 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

విశాఖపట్నం ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. 15 వేల మంది హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ నిర్వహణలో 145 మంది ఆర్మీ అధికారులు సిబ్బంది పాల్గొంటారని చెప్పారు.

దాతలూ ముందుకు రండి

ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకు కాకినాడలో జరిగే జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్ షిప్ పోటీల నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగానికి తగిన తోడ్పాటును అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ పోటీలు కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో జరుగుతాయన్నారు. 29 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది హాజరుకానున్నట్లు తెలిపారు.

నానాటికీ ప్రభంజనం..

- అధిక జనాభాతో వనరుల లభ్యత కరవు
- 2027 ఫిబ్రవరి 1 నుంచి జన, కులగణన
- రేపు ప్రపంచ జనాభా దినోత్సవం



అలమూరు: భారతదేశం జన ప్రభంజనం అవుతుంది.. నియంత్రించకుంటే భవిష్యత్ అధోగతిగా మారుతుంది.. చిన్న కుటుంబం– చింతలు లేని కుటుంబం. ఇద్దరు వద్దు.. ఒక్కరు ముద్దు. ఈ నినాదాలకు మళ్లీ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఏర్పడుతోంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశ జనాభా కేవలం 35 కోట్లు కాగా, 80 ఏళ్ల అనంతరం నాలుగు రెట్లకు పైగా చేరుకుందని అంచనా. రోజు రోజుకూ పెరిగిపోతున్న జనాభా వల్ల నానాటికీ కరిగిపోతున్న వనరులతో భవిష్యత్ తరాలకు ప్రమాదకరంగా మారింది. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాలైన ఆహారం, ఉపాధి, వివిధ అవసరాలు తీర్చడం ప్రభుత్వాలకు భారం అవుతోంది. అధిక జనాభాతో అడవులు సైతం అంతరించి పోతుండగా పంట భూములు ఆవాస ప్రాంతాలుగా మారిపోతున్నాయి. దీనివల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి భవిష్యత్‌లో పుడమికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని సామాజికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు ఐక్యరాజ్య సమితి అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తుంది.


ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ జనాభా 2011 గణాంకాల ప్రకారం 51,54,296 మంది ఉండగా, ఇందులో 25,69,888 మంది పురుషులు, 25,84,608 మంది స్త్రీలు ఉన్నారు. అయితే 2025 మార్చి 31 నాటికి ఈ జనాభా సుమారు 55.38 లక్షలుగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాను 2022 ఏప్రిల్ 4న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు జిల్లాలుగా విభజించింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మూడు నియోజకవర్గాలు ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కాగా, రంపచోడవరం నియోజకవర్గాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనం చేశారు. దీంతో జనాభా గణాంకాల్లో తీవ్రమైన వ్యత్యాసం ఏర్పడింది. జిల్లాలో 2001 జనాభా లెక్కల ప్రకారం 10.98 శాతంగా ఉన్న పెరుగుదల 2011కు వచ్చేసరికి 13.86 శాతంగా ఉంది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ జనాభా శాతం మరింత పెరిగి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీని వల్ల ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కష్టతరం అవుతుంది. జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో వాయు కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. అందువల్ల వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

జిల్లాల వారీగా జనాభా వివరాలు

జిల్లా	జనాభా	పురుషులు	స్త్రీలు	వైశాల్యం
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	17,19,013	8,58,632	8,60,381	2,083 కి.మీ
కాకినాడ	20,92,374	10,45,269	10,47,105	3,020 కి.మీ
తూర్పుగోదావరి	18,32,332	9,15,325	9,17,007	2,561 కి.మీ

గణనకు షెడ్యూల్ విడుదల

జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేస్తే దేశ భవిష్యత్తు బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. 2011లో జరిగిన జనగణన తరువాత పదేళ్ల తరువాత 2021లో జరగాల్సి ఉంది. అయితే ఆ సమయంలో కోవిడ్–19 ప్రభావం అధికంగా ఉండటంతో వాయిదా పడుతూ వస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గణనలో భాగంగా 2026 ఏప్రిల్ ఒకటి నుంచి తొలుత ఇళ్లు, ఆస్తుల వివరాలు నమోదు చేసుకునేందుకు నిర్ణయం తీసుకుంది. అనంతరం 2027 ఫిబ్రవరి నుంచి జన, కుల గణనలను ఒకేసారి చేపట్టేందుకు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. ఈ జన, కుల, ఆస్తుల గణనలో ప్రతి ఒక్కరి నుంచి 36 ప్రశ్నలకు సంబంధించి సమాచారాన్ని సేకరించనుంది.



ప్రపంచ జనాభా దినోత్సవం లోగో

ప్రాధాన్యం ఇస్తే మేలు

ఉమ్మడి జిల్లాలో అధిక జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. జనాభా పెరుగుదలతో కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ప్రసార మాధ్యమాల్లో ప్రచారం కల్పించాలి. కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి ప్రోత్సాహకాలను అందజేయాలి. సమాజంలో వీలైనంత మేరకు అధిక వయసు పెళ్లిళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివాహం చేసుకున్న ప్రతి జంట స్వచ్ఛంద నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నాగభూషణం (ఫైల్)

గోకవరం: అప్పటి వరకూ విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విధి నిర్వహణలో గుండెపోటుకు గురై తనువు చాలించాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గోకవరం గ్రామానికి చెందిన బొమ్మగంటి నాగభూషణం (57) తంటికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లెక్కల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన రెండు తరగతుల్లో బోధించారు. ఇంటర్వెల్ సమయంలో ఒక్కసారిగా ఆయన కుప్పకూలిపోగా తోటి ఉపాధ్యాయులు వెంటనే ఆయన్ని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన ఇటీవల రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి బదిలీపై తంటికొండకు వచ్చారు.

కుమార్తె వివాహం చేసిన నెలలోనే..

ఉపాధ్యాయుడు నాగభూషణంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు గత నెలలో ఘనంగా వివాహం జరిపించారు. ఇంతలోనే ఈ విషాద ఘటన జరగడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దళిత మహిళపై దాడి అమానుషం

- నిందితుడు ఎన్‌వీ రెడ్డిని అరెస్టు చేయాలి
- మాదిగ సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న మాదిగ న్యాయవాదుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఉదయ్‌కుమార్

అనపర్తి: దుప్పలపూడి గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళ కొమ్ము బుజ్జిపై దాడికి పాల్పడిన టీడీపీ నేత ఎస్.వెంకటరెడ్డి, అతని అనుచరులను 24 గంటల్లో అరెస్టు చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని మాదిగ న్యాయవాదుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సంయుక్తంగా డిమాండ్ చేశారు. బుధవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుజ్జిని వారు పరామర్శించారు. నిందితులు ఎంత పలుకుబడి కలిగిన వారైనా భయపడాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని బాధితురాలికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాదిగ న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడు కొండేపూడి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 6న దుప్పలపూడి గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత ఎస్.వెంకటరెడ్డి (ఎస్‌వీ) దళిత మహిళ బుజ్జిపై అమానుషంగా దాడి చేయడంతో మాదిగ సంఘాల తరఫున నిజ నిర్ధారణ కమిటీగా తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు. తమ పరిశీలనలో ఇది కచ్చితంగా కుల వివక్షతోనే జరిగిన దాడిగా గుర్తించామన్నారు. గతంలో జరిగిన ప్రమాదంలో పోలీసులు కేసు నమోదు చేయడం బుజ్జి మరిది వీరబాబు బెయిల్ పై రావడం వ్యవహారం కోర్టులో నడుస్తుండగా దళితులను, అమాయకులను భయభ్రాంతులకు గురి చేస్తూ వెంకటరెడ్డి తన అధికార మదంతో ఇంటి వద్ద ప్రైవేట్ పంచాయితీ నిర్వహించడమేంటని ఆయన ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా ఇటువంటి పనులను చేస్తున్న వెంకటరెడ్డిని మూడు రోజులు కావొస్తున్నా పోలీసులు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తపల్లి ప్రసాద్, ధూళి జయరాజు, ఆకుమర్తి చిన్నా, మానవ హక్కుల సంఘ సభ్యురాలు ఖండవిల్లి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకులు గాలంకి నాగేశ్వరరావు, పల్లేటి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరికి దిగొచ్చి... కొబ్బరి కాయలు వినియోగించి..

సాక్షి ఇంపాక్ట్



వీరేశ్వర స్వామివారికి కొబ్బరి నీళ్లతో అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి కల్యాణంలో కొబ్బరి కాయలను తిరిగి వినియోగించారు. కొబ్బరి ధరలు పెరగడంతో వాటిని పక్కనబెట్టి అభిషేకాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై 'సాక్షి' దినపత్రికలో 'వీరేశ్వరా.. క్షమించవా' అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో దేవస్థానం అధికారులు స్పందించి స్వామివారికి నిర్వహించే అభిషేకాల్లో కొబ్బరి కాయలను తిరిగి వినియోగించడం మొదలు పెట్టారు. రూ.వెయ్యి పెట్టి అభిషేకం చేయించుకుంటున్న భక్తుల పేరున వినియోగించాల్సిన రెండు కొబ్బరి కాయలను వాడకపోవడంపై వారు మండిపడుతున్నారు. దీనికి స్పందించిన ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ కొబ్బరికాయలతో అభిషేకం జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో గతంలో జరిగినట్లే కల్యాణ అభిషేకాలు జరుగుతున్నాయని తెలిపారు. కొబ్బరికాయలు అందుబాటులో లేకపోవడంతో కల్యాణ భక్తులకు అసౌకర్యం కలిగిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆలయ సూపరింటెండెంట్‌ను ఆరా తీయగా కొబ్బరి కాయల పాటదారుడు సకాలంలో కొబ్బరికాయలు సరఫరా చేయకపోవడం వల్ల అసౌకర్యం కలిగిందని, ఇది తన దృష్టికి రాగానే చర్యలు తీసుకున్నానని చెప్పారు. సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కొత్తపేట: స్థానిక బాబానగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై జి.సురేంద్ర కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన మనల్లె పావని (24), నాగరవీంద్రకు ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. రావులపాలెం సర్వే పామాయిల్ కంపెనీలో రవీంద్ర ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. సుమారు నాలుగు నెలల నుంచి కొత్తపేట బాబానగర్‌లో అద్దింట్లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం రవీంద్ర ఇంటికి రాగా తన భార్య ఉతికిన దుస్తులు ఆరబెట్టలేదని మందలించాడు. తరువాత రవీంద్ర పడక గదిలో నిద్రించగా పావని పక్క గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. ఇది గమనించిన భర్త చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి తన భార్యను కిందకు దించి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి కొండేపూడి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హజ్ యాత్ర-2026కు వెళ్లడానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు కేంద్రం ప్రకటించిన దృష్ట్యా 2025 జులై 31 వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం.సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్రలో పాల్గొనేవారు తప్పనిసరిగా ఇంటర్ నేషనల్ పాస్ పోర్ట్ కలిగి ఉండాలని, హజ్ సువిధ మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరణం, ఎమర్జెన్సీ మినహాయించి యాత్రను రద్దు చేసుకుంటే జరిమానా తప్పదని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి నామవరంలోని ఒక ఇంట్లో చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్ తెలిపారు. ఈ వివరాలు మీడియాకు ఆయన బుధవారం తెలిపారు. నామవరానికి చెందిన రేలంగి లోవరాజు ఈ నెల 2న ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలసి తలుపులమ్మ లోవకు వెళ్లారు. దానిని గమనించి నిందితులు రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన నలబా సత్యనారాయణ అనే సత్తిబాబు (32), బెదంపూడి రత్నరాజు అనే నాని (20), ఇనకోటి పవన్‌కుమార్ (20)లు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 22 కాసుల బంగారు నగలు, రూ. 1.75 లక్షలు దొంగించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన రాజానగరం సీఐ వీరయ్య గౌడ్ తమ సిబ్బందితో దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితులను అరెస్టు చేశారు. చోరీకి పాల్పడిన తరువాత నగదులో కొంత తమ విలాసాలకు వాడుకున్నారు. నిందితుల నుంచి 22 కాసుల బంగారు నగలతోపాటు రూ. 1.15 నగదును స్వాధీనపర్చుకున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

కాకినాడ క్రైం: ఓ వృద్ధురాలిని రైలు ఢీకొనడంతో మృతి చెందింది. స్థానిక దుమ్ములపేటకు చెందిన మూగు నూకరత్నం (64) బుధవారం తెల్లవారు జామున అదే ప్రాంతంలో ఉన్న రైల్వే ట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రైలు ఢీకొంది. ఆమె భర్త భూలోకం ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

సోషల్ వెల్ఫేర్ అటెండర్ ఆత్మహత్య

కాకినాడ క్రైం: స్థానిక గోళీలపేటలో నివాసం ఉంటున్న సూరాడ సంతోష్ (29) బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ కలెక్టరేట్‌లోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో రెగ్యులర్ విధానంలో అటెండర్‌గా సంతోష్ పనిచేస్తున్నాడు. ఆయనకు మైలపల్లి సత్యదేవితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది క్రితం ఓ పాప జన్మించింది. కొద్ది రోజులుగా పాప అనారోగ్యంతో బాధపడుతుంది. అలాగే సంతోష్ అప్పుల పాలయ్యాడు. ఈ విషయంపై మంగళవారం పుట్టింటికి వెళ్లిన భార్యకు ఫోన్ చేసి బాధపడ్డాడు. ఈ నేపథ్యంలో సంతోష్ బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు పంచెతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సత్యదేవి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.